

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థులు

కుక్కునూరు :కుక్కునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. కుక్కునూరు సర్పంచి రావుమీనా వినోద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ఆరంభించారు. అనంతరం ఉపాధ్యా యులు ప్రసన్నకుమార్, వెంకటరెడ్డి, అటెండర్‌గా బాధ్యతలు నిర్వహించిన మురళిలను ఘనంగా సత్కరించారు. చీఫ్ గెస్ట్‌గా పూర్వ విద్యార్థి, విద్యాసంస్థల అధినేత మాదినేని శ్రీనివాస్ తన సందేశాన్ని వినిపించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు నిర్మల సంతోష్, కుక్కునూరు మురళి, రావు వినోద్, వూటుకూరి రవి, నారాయణరాజు పాల్గొన్నారు.

తాయిలాల హోరు.. పందేల జోరు..!



- నోటిఫికేషన్ రాకుండానే ఎన్నికల వేడి
- మహిళా ఓటర్లే లక్ష్యంగా గిఫ్ట్‌లు పంపిణీ
- సెల్‌ఫోన్లు, చీరలు, కంచాలు వంటివి అందజేత
- నియోజకవర్గాల్లో పార్టీల గెలుపుపై పందేల జోరు
- గ్రామీణ ప్రాంతాల్లో రసవత్తరంగా రాజకీయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల షెడ్యూల్ రాకుండానే, అభ్యర్థుల ఎంపిక పూర్తి కాకుండానే జిల్లాలో ఎన్నికల వేడి తారాస్థాయికి చేరింది. మహిళా ఓటర్లే లక్ష్యంగా ఒకపక్క తాయిలాల హోరు, మరోపక్క అభ్యర్థులతో సంబంధం లేకుండా నియోజకవర్గాల్లో పార్టీల గెలుపుపై పందేల జోరు కొనసాగుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వేడి మరింత రసవత్తరంగా మారింది. రెండు జిల్లాల్లోనూ 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వైసిపి అభ్యర్థుల ఎంపికపై కొంత స్పష్టత రాగా, టిడిపి, జనసేన అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో స్పష్టత రాని పరిస్థితి ఉంది. అయితే రేపే పోలింగ్ అన్నట్లు పలు నియోజకవర్గాల్లో పరిస్థితి కన్పిస్తోంది. గతంలో ఎన్నికల ముందురోజు ఓటర్లకు తాయిలాలు, డబ్బు పంపిణీ వంటివి జరిగేవి. ఏ పార్టీ.. ఏమి ఇస్తుందనే చర్చ సైతం జనాల్లో సాగేది. ఈసారి అందుకు భిన్నంగా ఎన్నికల ప్రక్రియ సాగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే తాయిలాల పంపిణీ జోరుగా సాగుతోంది. ఏలూరులో డ్వాక్రా మహిళలతో ఓట్లు వేయించే విధంగా మెప్మా ఆర్‌పిలకు, వాలంటీర్లకు రూ.వేలు ఖరీదు చేసే సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి ఓటర్లను ఏ విధంగా ప్రలోభపెట్టాలో శిక్షణ సైతం ఇస్తున్నారు. ఆచంట, పాలకొల్లుతోపాటు పలుచోట్ల డ్వాక్రా మహిళలకు చీరల పంపిణీ ఇప్పటికే సాగిపోయింది. ఉండిలో కంచాలు పంపిణీ చేశారు. అధికారులు కళ్లెదుటే ఈ ప్రక్రియ కొనసాగుతున్నా ఎక్కడా అరికట్టేందుకు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. తాయిలాల పంపిణీలో అధికార పార్టీ మరింత దూకుడుగా ముందుకు సాగుతోంది. గిఫ్ట్‌లు అందించడంతోపాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఆరోగ్యశ్రీ కార్డులు, పింఛన్ సొమ్ము సైతం వైసిపి నాయకులే స్వయంగా ఇస్తూ ఓటు తమకే వేయాలంటూ ఓటర్లపై ఒత్తిడి తెస్తున్న పరిస్థితి ఉంది. మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకునేలా వెలుగు, మెప్మా సిబ్బందికి గిఫ్ట్‌లు అందించిన పరిస్థితి జిల్లాలో ఉంది. వాలంటీర్లకు సైతం పెద్దఎత్తున బహుమతులు అందిస్తూ ఓటర్లను ప్రభావితం చేసేవిధంగా ప్రణాళికలు రచించారు. గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్తూ ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతున్నారు. జనాలను తమవైపు తిప్పుకునేందుకు అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో మరింత వేగంగా ముందుకు సాగుతున్నారు.

గెలుపుపై పందేల జోరు..

గతంలో ఎన్నికలు ముగిసిన తర్వాత ఏ అభ్యర్థి గెలుస్తారో అనే దానిపై బెట్టింగులు సాగేవి. కొన్ని పందేలు అభ్యర్థులు గెలుపుపై కొనసాగేవిగా ఉండగా, మెజార్టీపై మరికొన్ని పందేలు సాగుతుండేవి. ప్రస్తుత ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ పూర్తికాకుండానే పందేల జోరు కొనసాగుతోంది. టిడిపి, జనసేనకు సంబంధించి అభ్యర్థుల పేర్లు పూర్తిస్థాయిలో వెలువడకపోయినా సీట్ల కేటాయింపుపై స్పష్టత రావడంతో దాని ఆధారంగా బెట్టింగులు సాగుతున్నాయి. నిన్నటి వరకూ నరసాపురం వంటి నియోజకవర్గాలో టిక్కెట్ ఏఅభ్యర్థికి వస్తుందో సైతం పందేలు సాగాయి. ఇప్పుడు నియోజకవర్గాల్లో ఏ పార్టీ గెలుస్తుందనే దానిపై పందేలు సాగుతున్నాయి. వైసిపి గెలుస్తుందా, టిడిపి, జనసేన కూటమి గెలుస్తుందా అంటూ గ్రామాల్లో పందేలు సాగుతున్నాయి. ఈ పందేలు సాగుతున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.


కుక్కునూరులో దుకాణాలు మూయించి నినదిస్తున్న నేతలు


బుట్టాయగూడెంలో రాస్తారోకో

ఏజెన్సీ బంద్ విజయవంతం

ఏజెన్సీ ఏరియాలో ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని, జిఒ నెం.3ని పునరుద్ధరించాలని, గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలను నూరుశాతం స్థానిక గిరిజనులకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యాన చేపట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతమైంది.


జీలుగుమిల్లిలో జాతీయ రహదారిపై నిరసన


పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో ధర్నా

పోలవరం:పోలవరంలో వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయా సంఘాల నేతలు ఏటిగట్టు సెంటర్లో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం మండల కార్యదర్శి బొరగం భూచంద్రరావు మాట్లాడుతూ జిఒ నెం.3ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో నూటికి నూరు శాతం కూడా షెడ్యూల్ తెగల్లో ఉన్న 34 తెగలకు చెందిన వారికే ఉద్యోగావకాశాలు కల్పించాలని, మాతృభాష వాలంటీర్లను తక్షణమే రెన్యువల్ చేయాలని కోరారు. నాన్ షెడ్యూల్ ఏరియాలో ఉన్న ఎస్‌టిలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని, వారికీ ఉద్యోగావకాశాలు కల్పించాలని లేదా జీవనభృతి ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోయిన గిరిజనేతర పేదలకూ ప్రభుత్వ హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సముద్రాల సాయికృష్ణ మాట్లాడగా కార్యక్రమంలో గిరిజన సంఘం నేతలు తామా బాలరాజు, గోకిన పాండవులు, మిడియం గంగాదేవి, తాతి రామలక్ష్మి, కొమరం బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు: స్థానిక గిరిజనులకు ఉద్యోగాలు కల్పించాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు శ్యామల లక్ష్మణరావు, పట్ల లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని కోరుతూ మండలంలో గిరిజన సంఘాల ఆధ్వర్యాన బంద్ విజయవంతంగా సాగింది. ఈ బంద్‌కు సిపిఎం మద్దతు ప్రకటించి పాల్గొంది. ఈ సందర్భంగా లక్ష్మణరావు, లక్ష్మయ్య మాట్లాడుతూ స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ తీరు వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రం మొత్తం ఐటిడిఎల పరిధిలో 517 ఉపాధ్యాయ పోస్టులను నోటిఫై చేస్తే వాటిలో 38 పోస్టులు మాత్రమే ఆదివాసులకు కేటాయించారన్నారు. ఏజెన్సీలో ఐదుశాతంగా ఉన్న గిరిజనేతరులకు 90 శాతం ఉద్యోగాలు కేటాయించడం దారుణమన్నారు. జిఒ నెం.3కి చట్టబద్ధత కల్పించేందుకు ఆర్డినెన్స్ తీసుకురావాలని, ఏజెన్సీలో ఉద్యోగాలన్నీ ఆదివాసులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆదివాసీ ప్రాంతంలో హైడ్రోపవర్ ప్రాజెక్టు, ఆయుధ కర్మాగార నిర్మాణం వెంటనే రద్దు చేయాలని, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్ల చినలక్ష్మయ్య, వర్స పుల్లారావు, సవలం అర్జున్, కారం బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: జిఒ నెం.3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ, గిరిజన సంఘాల అధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతంగా ముగిసింది. బంద్‌కు సిపిఎం, వామపక్షాల నాయకులు మద్దతు తెలిపారు. బంద్ ప్రభావంతో జీలుగుమిల్లిలోని వ్యాపార, వాణిజ్య దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. అనంతరం జాతీయ రహదారిపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు తెల్లం దుర్గారావు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు 14 పోస్టులు మాత్రమే కేటాయించడంతో గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే గిరిజన ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న పోస్టులతో స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులందరికీ పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్.కొండలరావు, గుడెల్లి వెంకట్రావు, అప్పారావు, దావీదు, నల్ల భీమశంకరం, కారం గంగరాజు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: ఏజెన్సీ బంద్ బుట్టాయగూడెం మండలంలో ఆదివారం సంపూర్ణంగా జరిగింది. బంద్‌నుద్దేశించి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రత్యేక డిఎస్‌సిని వెంటనే ప్రకటించాలని కోరారు. జిఒ నెం.3కు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టంలో సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమానికి కెవిపిఎస్ జిల్లా నేత అందుగుల ఫ్రాన్సిస్ సంఘీభావం తెలిపి మాట్లాడారు.

'పది'లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

పటిష్టమైన బందోబస్తు మధ్య పరీక్షల నిర్వహణ
డిఇఒ ఎస్.అబ్రహం





ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఈ ఏడాది జిల్లాలో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పూర్తి స్థాయిలో విద్యాశాఖ కృషి చేస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. పటిష్ట మైన బందోబస్తు మధ్య ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. పదో తరగతి పరీక్షలపై ప్రజాశక్తి ముఖాముఖిలో పలు వివరాలను ఆయన వెల్లడించారు.

ప్రశ్న: పదో తరగతి పరీక్షలు ఎప్పటి నుంచి ఎప్పటి వరకూ జరుగుతాయి?

పదో తరగతి పరీక్షలు ఈ నెల 18వ తేదీ నుంచి 30 వరకు పటిష్టమైన బందోబస్తు మధ్య నిర్వహిస్తున్నాం. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై 12.45 గంటల వరకు జరుగుతుంది. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి రావాల్సి ఉంటుంది. ఏమైనా సందేహాలుంటే పరీక్షలు ప్రారంభమయ్యే ముందు రోజు విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి తమ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసుకోవచ్చు. వారు పరీక్ష రాసే గదిని కూడా తనిఖీ చేసుకోవచ్చు. దీని వల్ల పరీక్ష కేంద్రానికి ఆలస్యం కాకుండా ఉండేలా ఈ ఏర్పాట్లు చేశాం.

ప్రశ్న: పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎంతమంది, ఎన్ని పరీక్షా కేంద్రాలు కేటాయించారు?

ఈ ఏడాది ఏలూరు జిల్లాలో 139 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. రెగ్యులర్ విద్యార్థులు 24125 మంది హాజరు కానున్నారు. వీరిలో బాలురు 11,760, బాలికలు 12,365 మంది ఉన్నారు. ప్రయివేట్ విద్యార్థులు 8230 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో ఐదు వేల మంది బాలురు, 3230 మంది బాలికలు ఉన్నారు. ప్రయివేట్, రెగ్యులర్ విద్యార్థులు మొత్తం కలిపి 32,350 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

ప్రశ్న: పరీక్షలు నిర్వహించిన అనంతరం పత్రాలను దాచి ఉంచే కేంద్రాలు ఏంటి? పరీక్షల నిర్వహణకు వినియోగించే సిబ్బంది ఎవరు?

పరీక్ష పూర్తయిన తర్వాత పత్రాలను జిల్లావ్యాప్తంగా 31 స్ట్రోరేజీ పాయింట్లలో భద్రపర్చేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. 139 పరీక్ష కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్ 139 మందిని, అడిషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్ 24 మందిని, ఒకటి, రెండు పాయింట్లలో 62 మంది కస్టోడియన్ ఆఫీసర్స్‌ను, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లను, 21 మంది రూట్ ఆఫీసర్స్‌ను, ప్రశ్నాపత్రాలకు 12 మంది రూట్ ఆఫీసర్స్, మరో 12 మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్స్, 1600 మంది ఇన్విజిలేటర్లను ఇప్పటికే నియమించాం.

ప్రశ్న: సున్నితమైన పరీక్షా కేంద్రాలను గుర్తించారా, వాటిలో ప్రత్యేక చర్యలు ఏమైనా చేపట్టారా?

జిల్లావ్యాప్తంగా ఆరు సున్నిత పరీక్ష కేంద్రాలను గుర్తించాం. వాటిలో ఉంగుటూరు మండలంలో కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్, లింగపాలెం మండలంలో రంగాపురం జిల్లా పరిషత్ హైస్కూల్, జంగారెడ్డిగూడెం మండలంలో లక్కవరం జిల్లా పరిషత్ హైస్కూల్, మండవల్లి మండలంలో చింతపాడు జిల్లా పరిషత్ హైస్కూల్, కలిదిండి మండలంలో కోరుకొల్లు జిల్లా పరిషత్ హైస్కూల్, గణపవరం మండలంలో పిప్పర జిల్లా పరిషత్ హైస్కూల్ ఉన్నాయి. ఈ ఆరు పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చాం. ఎప్పటికప్పుడు ఫ్లయింగ్ స్క్వాడ్ ఈ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తుంటారు.

ప్రశ్న: విద్యార్థులకు విద్యాశాఖ తరపున ప్రత్యేక సౌకర్యాలు ఏమైనా కల్పించారా?

విద్యార్థులకు ఉచిత బస్సు సర్వీస్ అందించే విధంగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్లను కండక్టర్లకు చూపిస్తే ఉచితంగా ప్రయాణించేందుకు ఆర్‌టిసి వీలు కల్పిస్తుంది. జిల్లాలో నాలుగు రూట్లలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడానికి విద్యాశాఖ తరపున ఆర్‌టిసి కోరాం. ప్రస్తుతం నూజివీడు రూట్‌లో ఒక బస్సు, లక్కవరం రూట్‌లో ఒక బస్సు, రామసింగవరం, కొత్తపల్లి రూట్‌లో ఒక్కో బస్సు ప్రత్యేకంగా నడిపేందుకు చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ఏమైనా రూపొందించారా?

ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా విజయకేతనం కార్యక్రమాన్ని చేపట్టాం. దీనిలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక పుస్తకాలను అందించాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. ప్రతి రోజూ టెస్టులు, గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తున్నాం. గతేడాది ఉత్తీర్ణత 62 శాతం ఉండగా ఈ ఏడాది ఆ శాతాన్ని అధిగమించి మంచి ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: మౌలిక సదుపాయాలు కల్పించారా?

విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాం. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మరుగుదొడ్లను, ప్రతి పరీక్ష గదిలో రెండు ట్యూబ్‌లైట్లు, నాలుగు ఫ్యాన్లను ఏర్పాటు చేశాం. ప్రతి కేంద్రం వద్ద ఒక ఎఎన్‌ఎం, ఒక పోలీస్ కానిస్టేబుల్‌ను నియమిస్తున్నాం.

ప్రశ్న: విద్యార్థులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏంటి?

విద్యార్థులకు ప్రస్తుతం పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లతో పాటు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించాం. విద్యార్థులు ఎటువంటి మాల్‌ప్రాక్టీస్‌కూ పాల్పడకుండా పరీక్షలు రాయాలి. పదో తరగతి పరీక్ష పత్రాలను ఈసారి మరింత సమర్థవంతంగా ఇస్తున్నారు. ప్రతిఒక్క ప్రశ్నపత్రానికి ప్రత్యేకమైన కోడ్ ఉంటుంది. ఈ పత్రాన్ని ఏ విద్యార్థి పూర్తి చేసి పంపారనే సమాచారం కూడా విద్యాశాఖ వద్ద ఉంటుంది. విద్యార్థులకు ఇదే నా శుభాకాంక్షలు. ప్రస్తుతం చేతి రాతను మెరుగుపరుచుకునేలా రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి. పరీక్షల సమయాల్లో ఊళ్లకు, ఫంక్షన్లకు, పార్టీలకు వెళ్లకుండా ఆటలకు దూరంగా ఉండాలి. ఈసారి ఏలూరు జిల్లాలో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కూడా కృషి చేస్తున్నారు.

ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోండి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సమర్ధ వంతంగా, ధైర్యంగా వినియోగించుకోవాలని కైకలూరు రూరల్ సిఐ కృష్ణకుమార్ తెలిపారు. మండలంలోని మణుగూరు, అయ్యవారి రుద్రవరం, కానుకొల్లు, ఉనికిలి, భైరవపట్నం గ్రామాల్లో పోలీసులు సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్స్(సిఎస్ఎఫ్)తో ఆదివారం కవాతు చేయించారు.

ఆగిరిపల్లి :రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఆగిరిపల్లి ఎస్ఐ బి.సురేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి పోలీసులు, కేంద్ర బలగాలు ఆదివారం కవాతు నిర్వహించారు.

రణమా.. మౌనమా..!



మరికొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడనుంది. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఖరారు ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఉమ్మడి జిల్లాలో అధికార వైసిపి అభ్యర్థులు దాదాపు ఖరారైనట్లేనని చెప్పొచ్చు. ప్రతిపక్ష టిడిపి జిల్లాలో పోటీ చేసే ఏడు స్థానాలకు తన అభ్యర్థులను ప్రకటించింది. మరో ఏడు స్థానాల్లో ఐదు స్థానాలు జనసేనకు, ఒక స్థానం బిజెపికి కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే టిడిపి నుంచి దెందులూరు స్థానానికే అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంటుంది.

అధికార పార్టీ వైసిపి ఒక చింతలపూడిలోనే ఇంటిపోరుతో సతమతమవుతోంది. అదీ పోటీలో లేని ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్యే సాగుతుండడం గమనార్హం. తొలుత టిక్కెట్ దక్కలేదని నిప్పులు చెరిగిన చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా తర్వాత తన రూటు మార్చి పార్టీలోనే ఉంటూ, వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనంటూ ఎంఎల్‌ఎగా దూకుడు పెంచారు. అదే సమయంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.విజయరాజుచే ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయించడంపై ఎంఎల్ఎ గ్రూపు గుర్రుగా ఉంది. దీంతో తన అనుచరగణంతో కొన్ని గ్రామాల్లో ఎలిజా ప్రారంభోత్సవాలు చేపట్టడం ఆ పార్టీలో నెలకొన్న విభేధాలకు నిదర్శనమని చెప్పొచ్చు. రానున్న రోజుల్లో ఆ పార్టీ అధిష్టానం దీన్ని ఎలా సరి చేస్తుందో వేచిచూడాలి.

ఇక ప్రతిపక్ష పొత్తు వల్ల వచ్చే లాభాలు ఎలాగుంటాయోగాని ప్రస్తుతం మాత్రం టిడిపి, జనసేన పార్టీలు తమ నేతల నుంచి తీవ్ర అసంతృప్తి, అసమ్మతి గళాలను ఎదుర్కోక తప్పడం లేదు. జనసేన అధిష్టానానికి తణుకు, ఏలూరు నియోజకవర్గాల్లో ధిక్కార స్వరం విన్పించగా.. టిడిపికి ఉండిలో మాజీ ఎంఎల్ఎ శివరామరాజు నుంచి ధిక్కారస్వరం విన్పిస్తోంది. అయితే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా.. లేక మౌనం వహిస్తారా అనేది వేచిచూడాలి. నూజివీడులో మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా లేక ఏ వైఖరి తీసుకుంటారో ఇంకా స్పష్టత లేదు.


అయితే ఇంకా అధికారికంగా ప్రకటన చేయని స్థానాల్లోనూ టిడిపి నేతలు తిరుగుబావుటా ఎగురేస్తుండటం ఆ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా పరిణమించిందనే చెప్పొచ్చు. దెందులూరు మినహా అభ్యర్థులను ప్రకటించాల్సిన కైకలూరు, పోలవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం స్థానాలు జనసేన, బిజెపికి కేటాయించనున్నట్లు టిడిపి అధిష్టానం ఆయా నియోజకవర్గాల్లోని తమ పార్టీ నేతలకు సమాచారం ఇచ్చింది. వీటిలో ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, పోలవరం నియోజకవర్గాల్లో టిడిపి నేతల నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. తాడేపల్లిగూడెంలో నేతలు సర్దుబాటు ధోరణి ప్రదర్శిస్తున్నా పోలింగ్ సమయానికి ఎలా వ్యవహరిస్తారనేది వేచిచూడాలి. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని ఉంగుటూరు టిక్కెట్ ఆశించిన గన్ని వీరాంజనేయులుపై టిడిపి మండల నేతలు ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆ పార్టీ నేతలు గన్నికే టిక్కెట్ ఇవ్వాలంటూ అమరావతి వెళ్లి పార్టీ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడం గమనార్హం. చంద్రబాబు నేరుగా మాట్లాడినా గన్ని ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఇక పోలవరం నియోజకవర్గంలో అయితే టిడిపి శ్రేణులు రగిలిపోతున్నాయి. మూకుమ్మడి రాజీనామాలకు ఆ పార్టీ శ్రేణులు సిద్ధపడటం గమనార్హం. నరసాపురం పార్టీ మూడు గ్రూపులుగా చీలిపోవడంతో టిడిపి అధిష్టానానికి ఎటువంటి ఇబ్బందీ లేకుండాపోయిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. భీమవరం నుంచి పవన్‌కళ్యాణ్ పోటీ చేయకుండా జనసేన అభ్యర్థిగా మాజీ ఎంఎల్ఎ పి.అంజిబాబు రంగంలోకి దిగితే టిడిపి శ్రేణులు సహకరించడం అనుమానమేనని ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలే చెబుతుండటం గమనార్హం. గోదావరి జిల్లాల్లో ఎక్కువ సీట్లు గెలుచుకున్న పార్టీనే అధికారంలోకి వస్తుందనే నమ్మకం ఉన్నప్పుడు జనసేనకు దాదాపు సగం స్థానాలు కేటాయించడమేమిటని టిడిపి నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇక కైకలూరు స్థానాన్ని బిజెపికి కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. గత టిడిపి ప్రభుత్వంలో బిజెపి నుంచి గెలుపొందిన కామినేని శ్రీనివాస్ మంత్రిగా పని చేసిన సంగతి తెలిసిందే. తర్వాత ఆయన ఎప్పటిలానే టిడిపితో చెట్టాపట్టాలేసుకుని ఉండేవారు. అయితే పొత్తుల నేపథ్యంలో బిజెపి కోటాలో తమ మనిషిని రంగంలోకి దింపేందుకు కైకలూరు సీటు చంద్రబాబు వదులుకున్నట్లు ప్రచారం సాగుతోంది. పైగా అక్కడి మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ టిడిపికి గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే.

ఇక ఎంపీ సీట్లకొస్తే ఏలూరు, నరసాపురం స్థానాల్లో ఏదోకటి బిజెపికి కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. నరసాపురం స్థానం కేటాయిస్తే మాజీ ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు బరిలోకి దిగే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే జన స్పందన ఎలా ఉంటుందో ఆసక్తికర అంశమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధి ఎలాగున్నా ఏక్షణం ఏ పార్టీలో ఉంటారో తెలియని వ్యక్తికి, రెండు పార్టీల తరపున నామినేషన్లు వేసిన చరిత్ర కలిగిన వ్యక్తికి టిక్కెట్ ఇస్తే అధికార వైసిపికి ఆయుధం ఇచ్చినట్లేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అదే సమయంలో ఏలూరు నుంచి పోటీ చేయడానికి బిజెపి నేత గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపనా చౌదరి) ఉవ్విళ్లూరుతున్నారు. ఇటీవల బూత్ ఏజెంట్ల సమావేశానికి సైతం కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజనాథ్‌సింగ్‌ను ఆహ్వానించి ఏలూరులో సమావేశం నిర్వహించారు. అయితే నరసాపురం సీటు బిజెపికి ఇస్తే ఏలూరు సీటు ఇవ్వడం అసాధ్యం. అదే జరిగితే తపనా చౌదరి ఏ వైఖరి తీసుకుంటారో వేచిచూడాలి. ఏదేమైనా ఈ ఎన్నికల్లో ఇప్పటి వరకూ పరిశీలిస్తే అధికార పార్టీకన్నా ప్రతిపక్ష పార్టీలకే అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటులో తలనొప్పులు ఎక్కువయ్యానేది బహిరంగ రహస్యం. సీట్లు, టిక్కెట్లు దక్కని నేతలు ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగి 'ఇక రణమే..' అంటారా, లేక వ్యూహాత్మక మౌనం వహిస్తారా అనేది వేచిచూడాలి.

-వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

క్యాష్ కొట్టు.. టిక్కెట్ పట్టు..!

'మీ దగ్గర డబ్బుందా.. అయితే టిక్కెట్ మీకే'.. ప్రస్తుతం ప్రధాన రాజకీయ పార్టీల్లో ఇదే ట్రెండ్ నడుస్తోంది. రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల వద్ద సొమ్ముంటే పోటీకి అర్హతున్నట్లే అన్నట్లుగా రాజకీయ పార్టీల అధినేతలు వ్యవహరిస్తుండటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఎంఎల్‌ఎగా పోటీ చేయాలనుకుంటే రూ.50 కోట్లు, ఎంపీగా పోటీ చేయాలనుకుంటే రూ.వంద కోట్లకు పైనే ఖర్చు చేయాల్సి ఉంటుందని షరతు కూడా విధించారు. కొంతమంది అభ్యర్థులు ఇప్పటికే దీనికి సంబంధించి కోట్లాది రూపాయలు ఆయా పార్టీల అధిష్టానాల వద్ద జమ చేసినట్లు సమాచారం.



- రాబోయే ఎన్నికల్లో పోటీకి డబ్బే ప్రామాణికంగా ప్రధాన పార్టీలు
- ఎంఎల్‌ఎకు రూ.50 కోట్లు, ఎంపీకి రూ.100 కోట్లకుపైనే
- ఎన్నికలను పూర్తిగా డబ్బు మాయం చేసిన రాజకీయ పార్టీలు

ప్రజాశక్తి - భీమవరం

డబ్బుంటేనే టిక్కెట్. ఇదీ వైసిపి, టిడిపి, జనసేన.. ఏ పార్టీకైనా ప్రామాణికం. డబ్బు లేకుంటే ఎంతటి సీనియర్ నేతైనా ఇంటి దగ్గరే కూర్చోవాలి. ఇప్పటికే వైసిపితోపాటు టిడిపి, జనసేన అభ్యర్థులకు టిక్కెట్ల కేటాయింపులో డబ్బునే ప్రామాణికంగా తీసుకున్నారనే ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే టిడిపి, జనసేన కూటమి అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించాయి. అధికార వైసిపి కూడా రెండు ఎంపీ స్థానాలతోపాటు మిగిలిన అసెంబ్లీ స్థానాలకూ అభ్యర్థిత్వాలను దాదాపు ఖరారు చేసింది. అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎస్‌సి, బిసిలైతే కనీసం రూ.30 కోట్లు, జనరల్ స్థానాల్లో అయితే రూ.50 కోట్లు కనీసం ఉండాలని షరతు పెట్టి టికెట్లు కేటాయిస్తున్నారని ప్రచారం సాగుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థిత్వాల కోసం నేతలు ఆస్తులను తనఖా పెడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో టిడిపికి కంచుకోటగా ఉన్న ఒక నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ఒక నేత ఇటీవల కొంత ఆస్తి అమ్మగా వచ్చిన డబ్బును అధిష్టానానికి డిపాజిట్ చేశారని, అలాగే మరికొంత ఆస్తిని తనఖా పెడుతున్నారని ప్రచారం సాగుతోంది. ఇదే నియోజకవర్గంలో మాజీ ఎంఎల్ఎ టిక్కెట్ ఆశించినా ఆయన వద్ద అంత సొమ్ము లేదనే కారణం చూపి టిక్కెట్ కేటాయించలేదని ప్రచారం సాగుతోంది. తీర ప్రాంతంలో ఉన్న నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. గత ఎన్నికల్లో అధికార వైసిపిపై అతి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన అభ్యర్థి వద్ద అంత సొమ్ము లేదని మరో నేతను తెరపైకి తీసుకొచ్చినట్లు ప్రచారం సాగుతోంది. వైసిపికి చెందిన కొంతమంది అభ్యర్థులు రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు వరకూ అధిష్టానానికి డిపాజిట్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో ధనికులైన అభ్యర్థులు లేక ఉన్నవారినే బరిలోకి దింపుతూ ఆయా నియోజకవర్గాల్లోని పార్టీ విధేయులు, వ్యాపారులకు బాధ్యత అప్పగిస్తున్నారు. ఇప్పుడు అభ్యర్థి గెలుపునకు సహకరిస్తే అధికారంలోకి వచ్చాక మీకు అవసరమైన పనులు చేసి పెడతామని ఆఫర్ ఇస్తున్నట్లు ప్రచారం ఉంది. ఏదేమైనా ఎన్నికల్లో పోటీ అంటే ప్రస్తుతం డబ్బే అర్హతగా మారింది. అయితే వామపక్షాలు మాత్రమే ప్రజా సమస్యలపై పోరాటాల అజెండాను తీసుకుని నిరంతరం ముందుకు సాగుతున్నాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి - భీమడోలు

ఉజ్వల భవిష్యత్తు కోసం విద్య ప్రాముఖ్యతను తెలుసుకుని ప్రతిఒక్కరూ విద్యావంతులుగా మారాలని సూరప్పగూడెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మండే సుధాకర్ కోరారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో సూరప్పగూడెం గ్రామంలోని ఒక ప్రార్థనాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామం నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న సుమారు 20 మంది విద్యార్థులకు తొమ్మిది అంశాలతో కూడిన పరీక్షా సామగ్రిని ప్రముఖుల చేతులమీదుగా అందించారు. వీటిని మండే సుధాకర్‌తో పాటు, గ్రామస్తులు బోడ ఆదినారాయణ సమకూర్చారు. దీంతోపాటు వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి బాటిల్ అదనంగా పంపిణీ చేశారు.

చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

రజక జన సంఘం జిల్లా అధ్యక్షులు కట్టయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వాలు రజకులకు జీఓల ప్రకారం కేటాయించిన, వారికి పూర్తి హక్కు కలిగిన చెరువులపై ఆక్రమణలకు పాల్పడుతున్నవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని రజక జన సంఘం జిల్లా అధ్యక్షులు చిలకలపూడి కట్టయ్య కోరారు. ఏలూరు మున్సిపాలిటీ పరిధిలోని సంతకవరితోట సమీపంలో రజకుల చెరువు గట్లపైన చెట్లను కొంతమంది కొట్టడంతో రజకులు అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు ఆదివారం చెరువు వద్ద స్థానిక రజక సంఘ సభ్యులతో జిల్లా నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టయ్య మాట్లాడుతూ 1903లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం రజకులకు అధికారికంగా చెరువును కేటాయించారన్నారు. అప్పటి నుంచి నేటి వరకు రజకుల స్వాధీనంలోని చెరువు ఆక్రమణకు కొంతమంది పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రజకుల వృత్తి చెరువు విషయంలో వారికి న్యాయం జరిగేలా జిల్లా అధికారులు కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కట్టయ్య డిమాండ్ చేశారు.

'పోరాటానికి సిద్ధం కావాలి'

ప్రజాశక్తి - చింతలపూడి

ముగ్గురు శత్రువులతో మనం పోరాటానికి సిద్ధం కావాలని వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కంభం విజయరాజు పిలుపునిచ్చారు. మండలంలోని సీతానగరంలో ఎంపిటిసి సభ్యులు కలకొండ రామారావు, రేచర్ల పంచాయతీలో సర్పంచి శివరామకృష్ణ, అల్లిపల్లి గ్రామంలో భరత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ వైసిపికి అధికమెజార్టీ వచ్చేలా ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని చెప్పారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇంటర్నల్ రోడ్లు వేస్తామన్నారు.

సిద్ధం సభకు తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి వైసిపి శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని చిగురుకోట, నరసన్నపాలెంకి చెందిన వైసిపి పార్టీ శ్రేణులు ముదినేపల్లిలోని ఎంపిపి కార్యాలయం వద్ద నుంచి వివిధ వాహనాల్లో అద్దంకి మేదరమెట్లలో జరిగే సిఎం సిద్ధం భారీ బహిరంగ సభకు తరలివెళ్లారు.

ఎస్‌ఆర్ నగర్ వాసుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అల్లూరి సీతారామరాజునగర్ వాసుల సమస్యలు పరిష్కరించాలని జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు డిమాండ్ చేశారు. మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన టి.నరసాపురంలో మహాశివరాత్రి, 28వ కళ్యాణ మహోత్సవం సందర్భంగా శ్రీ కన్యక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని ఆలయ కమిటీ, టిడిపి, జనసేన నాయకులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. టిడిపి నాయకులు కాసనేని వెంకట్రావు ఇంటి వద్ద స్థానిక టిడిపి నాయకులను, కార్యకర్తలను కలిసి వారి మద్దతు కోరారు. ఈ పర్యటనలో భాగంగా మండలంలోని ఎస్ఆర్ నగర్ వాసులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు.

నేడు వైఎస్‌ఆర్ చేయూత చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలంలో చేయూత పథకం నాలుగో విడత చెక్కులను ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ఈ నెల11వ తేదీన గోపీనాథపట్నం కళ్యాణ మండపంలో పంపిణీ చేయనున్నారు. మండలంలో 7435 మందికి రూ.8.88 కోట్లకు సంబంధించి చెక్కులను అందిస్తారని ఎంపిపి గంటా శ్రీలక్ష్మి తెలిపారు.

'వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం'

ప్రజాశక్తి - మండవల్లి

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యమని, ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని టిడిపి కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్ అన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నిర్వహిస్తున్న ధర్మ పోరాట పాదయాత్ర ఆదివారం మూడోరోజు ప్రత్తిపాడులో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యపడుతుందన్నారు.

నేడు మాల మహానాడు కార్యాలయం ప్రారంభం

ముదినేపల్లి :ఏలూరులోని ఫైర్ స్టేషన్ ఎన్ఆర్‌పేటలోని జాన్‌వీధిలో మాల మహానాడు, అనుబంధ సంఘాల జిల్లా కార్యాలయాన్ని ఈ నెల 11వ తేదీ సోమవారం ప్రారంభించనున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు ఆదివారం తెలిపారు. ఈ కార్యాలయాన్ని ఒఎన్‌జిసి డిప్యూటీ జిఎం బాయిరెడ్డి మిల్కీ వే ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు చిన్న సునీల్‌తో పాటు పలువురు నాయకులు, మాల మహానాడు అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని బాబూరావు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

యువకుడిపై దాడి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రేమ వివాహం చేసుకున్నాడని ఓ వ్యక్తిపై కత్తులతో, కర్రలతో దాడి చేసి గాయపర్చిన ఘటన మండల పరిధిలోని సీతారామపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీతారామపురం గ్రామానికి చెందిన కందుల శివ, అదే గ్రామానికి చెందిన చైతన్య శ్రావణి ఈ నెల ఎనిమిదో తేదీన ఏలూరులో ప్రేమ వివాహం చేసుకుని తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఆగిరిపల్లి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరు కుటుంబాల పెద్దలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. తొమ్మిదో తేదీ శనివారం యువతి బంధువులు కందుల శివపై కత్తులు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో గాయాలపాలైన శివ నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుకు మహిళ మృతి

టి.నరసాపురం :పాముకాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని శ్రీరామవరంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కునూరు మండలం దాచారం గ్రామానికి చెందిన వర్లాలక్ష్మి, సుబ్బయ్య దంపతులు 20 ఏళ్లుగా మండలంలోని శ్రీరామవరంలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఎప్పటిలాగానే లక్ష్మి ఈ నెల 9వ తేదీన ఉదయం అదే గ్రామానికి చెందిన కాల్నీడి లక్ష్మణరావు జీడి తోటలోకి చెట్ల కింద ఆకులు శుభ్రం చేసే పనికి వెళ్లింది. సాయంత్రం 4:30 గంటల సమయంలో పాము కాటుకు గురవ్వడంతో ఆమెను చింతలపూడి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త సుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరావు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

టి.నరసాపురం :అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బొర్రంపాలెంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారనే సమాచారం మేరకు విజిలెన్స్, రెవెన్యూ అధికారులు ఆదివారం సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో 19 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని 11వ నెంబరు దుకాణానికి తరలించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మహనీయురాలు సావిత్రిబాయి పూలే

ప్రజాశక్తి - మండవల్లి

మహిళా హక్కుల కోసం పోరాడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు, సామాజికవేత్త కొరపాటి శాంతరాజు, ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. మండల కేంద్రమైన మండవల్లి సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సావిత్రిబాయి వర్ధంతి కార్యక్రమాన్ని అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి విశేష కృషిచేసిన సామాజిక విప్లవ ఉద్యమకారులు సావిత్రిబాయి పూలే దంపతులని అన్నారు.

ముగిసిన బలివే ఉత్సవాలు

ప్రజాశక్తి - ముసునూరు

బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవాల ముగింపు రోజు ఆదివారం బలివే గ్రామంలోని తమ్మిలేరులో భక్తులు జల్లు స్నానాలు చేసి దర్శనం చేసుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ పి.వాసు, ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవి, తహాశీల్దార్ జవహర్ బాజీ, పలువురు ప్రత్యేకాధికారులు పర్యవేక్షించారన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని వెంకటాద్రిపురం, ఓగిరాల తండా, యనమదల, బత్తులవారిగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. జల జీవన్ మిషన్ కింద రూ.2.6 కోట్ల వ్యయంతో రక్షిత తాగునీటి ట్యాంకులను, పైపులైన్లను నిర్మించనున్నారు.

పాస్టర్లకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

పాస్టర్లకు సమాజంలో ఎదురవుతున్న పలు సమస్యలపై చట్టపరంగా రక్షణ కల్పించాలని ఆలిండియా క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, హెచ్ఆర్ఎసిసి జాతీయ సెక్రటరీ ఎం.డేవిడ్ లివింగ్ స్టన్ కోరారు. ఈ మేరకు చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్‌ను పలువురు పాస్టర్లు ఆదివారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. చట్టపరమైన విషయాల్లో పోలీసులకు పాస్టర్లు సహకరిస్తామన్నారు. అనంతరం ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్ఐను పాస్టర్లు సత్కరించారు.

భీమడోలులో వైసిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు వైసిపి తరపున ఎన్నికల ప్రచారాన్ని భీమడోలు మండలంలో ఆదివారం ప్రారంభించారు. దీనిలో భాగంగా నియోజకవర్గ శివారు ప్రాంతమైన మల్లవరం నుంచి భీమడోలు మండలం శివారు ప్రాంతమైన మల్కి మహమ్మద్‌పురం వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఒకే మోటార్ సైకిల్‌పై ఎంఎల్ఎతో పాటు ఏలూరు పార్లమెంటరీ అభ్యర్థి కారుమూరి సునీల్ కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీని వైసిపి మండల ఇన్‌ఛార్జి పుప్పాల కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు రూరల్ మండలానికి చెందిన పది మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.12.2 లక్షల చెక్కులను ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. సిఎం జగన్‌కు, ఎంఎల్ఎకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు లైసెన్, వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

కాపు సంక్షేమ సంఘం అధ్యక్షునిగా శ్రీరాములు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కాపు సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షునిగా పులి శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరులోని ఒక కళ్యాణ మండపలో ఆదివారం నిర్వహించిన కాపు ప్రముఖుల విస్తృత స్థాయి సమావేశంలో నూతన కమిటీల ఎంపిక బాధ్యతను పులి శ్రీరాములుకు ఇస్తూ తీర్మానించారు. ఈ సందర్భంగా పులి శ్రీరాములు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన కూటమి విజయానికి కృషి చేస్తామన్నారు.

'వైసిపిని గద్దె దించాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసిపిని గద్దె దింపాలని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బివి.రావు అన్నారు. జనసేన జనభేరి పాదయాత్రలో భాగంగా మండలంలోని వాడవల్లి గ్రామంలో ఆదివారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బివి.రావు మాట్లాడుతూ నియోజవర్గంలో వైసిపి నాయకుల అరాచకాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను ఘోరంగా ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రాజెక్ట్ నవయాన్ సంస్థ సేవలు అభినందనీయం

ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కైకలూరు

ప్రాజెక్ట్ నవయాన్ సంస్థ సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కొనియాడారు. మండలంలోని జాన్‌పేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్ట్ నవయాన్ చేస్తున్న పేదల అభివృద్ధి కార్యక్రమాలను కొనియాడి సభ్యులను అభినందించారు. మండలంలోని పలు గ్రామాల్లో నిరాశ్రయులైన ఎస్‌సి, ఎస్‌టి ప్రజలకు ఈ సంస్థ ద్వారా ఓటర్ కార్డులు, ఆధార్ గుర్తింపు కార్డులు, కుల ధృవీకరణ పత్రాల జారీకి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం కైకలూరు, ఆటపాక గ్రామాల్లోని పలువురు నిరుపేదలకు ప్రాజెక్ట్ నవయాన్ ద్వారా రేషన్ కార్డులు అందించి వారికి మొదటి సారిగా ప్రభుత్వం అందించే రేషన్‌బియ్యం, ఇతర సరుకులను సరఫరా చేశారు. వీరి పిల్లల చదువులకు అవసరమైన ధృవీకరణ పత్రాలను ప్రాజెక్ట్ నవయాన్ కల్పించడం వారి జీవితాల్లో వెలుగులు నింపడమేనన్నారు. ఎంపిపి కృష్ణమోహన్ మాట్లాడుతూ కొంత కాలంగా జాన్‌పేట యువకులచే నిర్వహిస్తున్న ప్రాజెక్ట్ నవయాన్ కృషి ఏ నాయకుడి వల్ల సాధ్య పడలేదన్నారు. సంస్థ అధ్యక్షులు విజయ్ వంగలపూడి రానున్న రోజుల్లో చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ నవయాన్ అధ్యక్షులు విజయ్ వంగలపూడి, ఆటపాక సర్పంచి తలారి మణిమ్మ, దూలం వినయ్, యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధీర్, ఉపాధ్యక్షుడు రాకేష్, జాషువా, యోహాను, సంపత్, వేనోష్, పాల్సన్, కరుణాకర్, బన్ను పాల్గొన్నారు.

ఎంఎంసి చైర్మన్ పదవి కృష్ణవేణికి రావడంపై హర్షం

ప్రజాశక్తి - ముసునూరు



కృష్ణవేణిని అభినందిస్తున్న జెడ్‌పిటిసి ప్రతాప్

నూజివీడు ఎఎంసి చైర్మన్ పదవి కంభాల కృష్ణవేణి రాంబాబుకు రావడం చాలా ఆనందదాయకమని జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్ అన్నారు. మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన వైసిపి గ్రామ నాయకులు కంభాల రాంబాబు సతీమణి కంభాల కృష్ణవేణికి ఎస్‌సి రిజర్వేషన్ కోటాలో పదవి ఇచ్చి ఎస్‌సిలకు మంచి ప్రాధ్యానత ఇచ్చిన నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కృష్ణవేణిని వైసిపి మండలాధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావ్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి పాముల గంగాధరరావు, సర్పంచులు పేరం కృష్ణ, చలసాని దామెదరరావు, రంగు ధనలక్ష్మి, రాజబోయిన శ్రీదేవి, శ్రీనివాసరావు, గద్దల సుహాసిని మోహనరావు, ముసునూరు సోషల్ మీడియో కన్వీనర్ కంభాల దాసు అభినందించారు.

ఇంటర్నెట్‌లో ఆటలకు దూరంగా ఉండాలి

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన కంభం విజయరాజు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

పిల్లలు, యువత ఆన్‌లైన్ ఆటలకు దూరంగా ఉండాలని వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు అన్నారు. మండలంలోని సీతానగరంలో కీర్తిశేషులు గుమ్మల ప్రసాద్ జ్ఞాపకార్థం మనోజ్ కుమార్ (పండు) ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను కోటగిరి అనితతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్ యువతకు ఎంతో ఇష్టమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఎవరు గెలిచినా ఎవరు ఓడినా క్రీడా స్ఫూర్తిని పాటించాలన్నారు. అనంతరం కోటగిరి అనిత మాట్లాడుతూ గుమ్మల ప్రసాద్ జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత చింతలపూడి నియోజకవర్గ పరిధిలో మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. అందరూ కలిసిమెలిసి పనిచేయాలని, వివాదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజ సుధాకర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ఎన్ఆర్.పేటలోని ఓవర్ బ్రిడ్జి పక్కన న్యాయవాది, జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి సౌజన్యంతో ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు ఆదివారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ గత 25 ఏళ్ల నుంచి కృష్ణారెడ్డి వేసవికాలంలో రోడ్డుపై వెళ్లే ప్రజల దాహార్తిని తీర్చడానికి హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నందున స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు ముందుకు వచ్చి జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం చలివేంద్రం వద్ద రోడ్డుపై వెళ్లే పాదచారులకు, వాహనదారులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కెబి.రావు, కార్యదర్శి బివివి.సత్యనారాయణ, ట్రెజరర్ డి.రమాదేవి, బి.పద్మజావాణి, డాక్టర్ సుబ్బారావు, ఎల్‌విఆర్ పాల్గొన్నారు.

చింతలపూడిని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా

టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గాన్ని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే తన కళ అనిటిడిపి, జనసేన చింతలపూడి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పట్టణంలో టిడిపి, జనసేన సమన్వయ సమావేశం జనసేన పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు చేతరాల మధుబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ టిడిపి, జనసేన వేర్వేరు కాదని, రెండింటిది ఒకటే గుండె అని అన్నారు. ప్రతి ఒక్కరిని కలుపుకుని ముందుకెళ్తామన్నారు. మేకా ఈశ్వయ్య మాట్లాడుతూ టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ విజయం దాదాపు ఖాయమని, ఎంత మెజార్టీ వస్తుందని ఎదురు చూస్తున్నామన్నారు. తర్వాత జనసేన పార్టీకి పదవుల్లో నామినేట్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ఎఎంసి ఛైర్మన్ పదవి ఇవ్వాలని, దీనిపై ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ మురళి, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఘంటసాల లక్ష్మి, తాతాజీ, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

చింతలపూడి :ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నానని ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రతి సమస్యను పరిష్కరిస్తానని టిడిపి, జనసేన చింతలపూడి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని వెలమపేట, పాత చింతలపూడి, సమ్మిటివారిగూడెం గ్రామాల్లో ఇంటింటికీ సూపర్ సిక్స్ పథకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ సమస్యలను రోషన్‌కుమార్‌కు వివరించారు. ఇంటింటికీ తాగునీటి కుళాయి ఉన్నా నీరు రావడంలేదని చెప్పారు. డ్రెయినేజీలు లేవన్నారు. 13 ఏళ్ల ఇక్కడే నివసిస్తున్న తమకు ఇంటి స్థలం, ఇల్లు ఇవ్వలేదని, వృద్ధాప్య పింఛన్ రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాగునీటి, డ్రెయినేజీ, పెన్షన్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రగడవరంలో టిడిపి కార్యాలయం ప్రారంభించారు.

గుండుగొలనుకుంటలో ఆహార పక్షోత్సవాలు

ద్వారకాతిరుమల :జంగారెడ్డిగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ద్వారకాతిరుమల సెక్టార్లలో ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి 23 వరకు ఆహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గుండు గొలనుకుంటలో అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు, బాలింతలకు, తల్లులకు కూరగాయలు, ఆకుకూరల గురించి వివరించారు.

పోలవరం సీటు టిడిపికే ఇవ్వాలి

బొరగం శ్రీనివాసులుకే తమ మద్దతు అంటున్న కార్యకర్తలు

ప్రజాశక్తి - కుక్కునూరు

టిడిపి, జనసేన పొత్తు మొదట్లో బాగానే ఉన్నా రాను రాను ఇబ్బందికరంగా మారుతుంది. పొత్తులో భాగంగా కొన్ని సీట్లు జనసేనకు ఇవ్వాల్సి ఉండగా, బిజెపి కూడా జతకట్టడంతో సీట్ల పంపకంలో విభేదాలు తలెత్తుతున్నాయి. పోలవరం ఎంఎల్ఎ సీటు జనసేనకు వెళ్తుందనే ప్రచారంతో ముందస్తుగా తెలుగుదేశం కార్యకర్తలు కుక్కునూరులో సమావేశమయ్యారు. పోలవరం సీటు ఎట్టి పరిస్థితుల్లోనూ టిడిపికి తప్ప మరెవ్వరికీ కూడా ఇవ్వొద్దని ముక్తకంఠంతో నినదించారు. కష్టకాలంలో కూడా పార్టీని ముందుకు నడిపించిన ఘనత బొరగం శ్రీనివాస్‌కే దక్కుతుందని ఆ పార్టీ కార్యకర్తలు అన్నారు. గోదావరి వరదల సమయంలో ప్రజలతోనే ఉంటూ బొరగం శ్రీనివాసులు వారి కష్టసుఖాలు తెలుసుకున్నారన్నారు. తమను అన్ని విధాలుగా ఆదుకుంటున్న నాయకులు, గత ఐదేళ్లుగా ప్రజల్లో ఉన్న వ్యక్తి తమ పూర్తి మద్దతు బొరగం శ్రీనివాసులుకే ఉంటుందని కార్యకర్తలు తెలిపారు. అదేవిధంగా చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లిన సందర్భంలో పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని అన్నారు. ఆ సందర్భంలో పవన్ కళ్యాణ్ చంద్రబాబుకు మద్దతుగా నిలవడంతో తెలుగు తమ్ముళ్లకు కూడా కొంత ఉత్సాహం వచ్చిందన్నారు. రాష్ట్రంలో బంపర్ మెజారిటీగా గెలిచే ఏకైక సీటు పోలవరం సీటు అని టిడిపి కుక్కునూరు మండలాధ్యక్షులు నాగేశ్వరరావు అన్నారు. ఈ సమావేశంలో మొలిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు మధుర వెంకటరమణ, ఉప సర్పంచి ఇచ్చుక రాజు, మారేడుబాక ఎంపిటిసి సభ్యులు ముప్పాల సాంబశివరావు, తెలుగుదేశం నాయకులు బొల్లు కృష్ణ, చుంచు సత్యనారాయణ, సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, టిడిపినాయకులు పాల్గొన్నారు.

పోలవరం బొరగం శ్రీనివాసులుకె కేటాయించాలి

వేలేరుపాడు : బొరగం శ్రీనివాసులకు పోలవరం ఎంఎల్ఎ టిక్కెట్ ఇవ్వాలని టిడిపి మండలాధ్యక్షులు అమరవరపు అశోక్ కోరారు. స్థానికంగా ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం నియోజకవర్గంలోని సమస్యలను అన్నివిధాలుగా తెలుసుకున్న ఒకే ఒక వ్యక్తి బొరగం శ్రీనివాసులుకే టిక్కెట్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, బూత్ ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకున్న టిడిపి నేత

బుట్టాయగూడెం : పోలవరం టిక్కెట్ బొరగం శ్రీనివాసులుకే ఇవ్వాలని మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆదివారం నిరసన తెలిపారు. ఈ నిరసనలో టిడిపి సీనియర్ నేత ఆండ్రూ శ్యామ్‌కుమార్ ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. పక్కనే ఉన్న నాయకులు, కార్యకర్తలు పెట్రోల్ డబ్బా లాక్కున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గం టిడిపికి కంచుకోట అని, 2019లో ఓడినప్పటి నుంచి బొరగం శ్రీనివాసులు ప్రజల్లోనే ఉంటూ పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారని, కార్యకర్తలకు, ఆపన్నులకు అండగా ఉన్నారని చెప్పారు. బొరగం శ్రీనివాసులుకు టిక్కెట్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మడకం రామకృష్ణ, ఉపాధ్యక్షులు తెల్లం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి మొడియం బుజ్జి, జిల్లా అధికార ప్రతినిధి జారం చాందినీ, విద్యా సాగరిక, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం పోలవరం నియోజకవర్గ సీటు కేటాయింపు విషయంలో అధిష్టానం పునరాలోచించాలని టిడిపి సీనియర్ నాయకులు కుంచే దొరబాబు అన్నారు. పోలవరంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు నివాసం వద్ద ఆదివారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బొరగం శ్రీనివాసులుకు పోలవరం సీటు కేటాయించాలని కోరారు. టిడిపి మాజీ మండలాధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య మాట్లాడుతూ టిడిపి కుటుంబం సమక్షంలో జరిగిన అంతరంగిక వ్యవహారాలను వైసిపి వక్రీకరించడం దారుణమన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు జల్లేపల్లి వెంకట నరసింహరావు, పెద్దేహపు సత్యనారాయణ, టిడిపి మండలాధ్యక్షులు బొడ్డు కృష్ణ, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు గుబ్బా రాంబాబు, నునకాని రాంబాబు, ఎస్‌సి సెల్ నాయకులు పిల్లి నాగరాజు పాల్గొన్నారు.

విభేధాలు పక్కన పెట్టి పనిచేయాలి

ప్రజాశక్తి - కామవరపుకోట

నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు, విభేధాలు పక్కన పెట్టి వైసిపి నాయకులు, కార్యకర్తలందరూ కలిసి పని చేయాలని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్‌రాజు అన్నారు. కామవరపుకోట సొసైటీ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం నిర్వహించిన వైసిపి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత బంక్ ఆవరణలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కామవరపుకోట సొసైటీ ఛైర్మన్ సాయిన కనకరాజు, కామవరపుకోట ఉప సర్పంచి మేడూరు రంగబాబు పాల్గొన్నారు.

15న బహుజన భేరి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఈ నెల 15న విజయవాడ విద్యాధరపురంలోని మున్సిపల్ మైదానంలో బహుజన భేరి నిర్వహిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి తెలిపారు. స్థానిక కొత్త రోడ్డులో ఉన్న నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు సిరా భరత్ అధ్యక్షతన జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పరంజ్యోతి మాట్లాడారు. చింతలపూడికి చెందిన ప్రముఖ న్యాయవాది ఎల్‌వి.చైతన్య తన అనుచరులతో కలిసి బిఎస్‌పిలో చేరారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT BOBBILI
O.S.20/2021

Between:
Smt. Kondaparthi Pydiraju .....Plaintiff
And:
Smt.Rambarki Gunnamma and 8 others. ......Defendants
To:

NOTICE

Respondents/Defendant No.6:
Smt.Muppidi Sita, W/o.Venkata Ramana, aged 24 years, resident of Laxminarayanadevipeta in Polavaram mandal, Eluru District.
(Defendant No.6)

Please take notice that the above named plaintiff filed the above case in O.S.20/2021 against you and the matter coming for your appearance and stands posted to **20.03.2024** on that day you are personally or through advocate attend before the Honourable Court at **10.30 AM** failing which the Honourable Court is decided under the court of Law.

Manthini Simhachalam
Advocate,Bobbili,
Vizianagaram District,
Cell No.9440963385
Bobbili
Dt: 10.03.2024

BEFORE THE MICRO & SMALL ENTERPRISES FACILITATION COUNCIL (MSEFC)RANGA REDDY REGION:: HYDERABAD
Case no.319/MSEFC/2023
AND
320/MSEFC/2023

Dispute Between:
M/s. SRI VINAYAKA CORES & TUBES, 3-1-171, Plot No 15, Road No 3,LB Nagar, Goutham Nagar, Hyderabad Pincode-500035 ...Claimant
Vs
M/s. Sri Srinivas Spintex India Limited, D.no.8-104 & 105, K.N Road, Peddatadepalli(V), Tadepalligudem, West Godavari Dist, AP Pin-534101. ...Respondent

NOTICE

The above named Claimant had filed Reference and statement of claim against the Respondent for recovery of dues by statutory Arbitration as per MSMED Act of 2006. Respondent failed to comply with previous notices. Hence, this final notice requires Respondent to make his personal appearance before Facilitation Council located at GMDIC, S-31, Second Floor, Integrated District Offices Comples(IDOC), Collectorate, RangaReddy District, located in Kongarkalam (V) Ibrahimpatanam (M), Ranga Reddy District -Pincode-501510 on 16.03.2024 at 3.30 PM. In case of non-compliance, the said claim will be decided on merits by Council.
// BY ORDER OF THE CHAIRMAN MSEFC: RANGA REDDY\\

BEFORE THE MICRO & SMALL ENTERPRISES FACILITATION COUNCIL (MSEFC)RANGA REDDY REGION::HYDERABAD.
Case no. 318/MSEFC/2023
AND
321/MSEFC/2023

Dispute Between:
M/s. SRI DHANLAKSHMI PAPER CONES,3-1-171,Plot No 15, Road No 3,L B Nagar, Goutham Nagar, Hyderabad Pincode-500035 ...Claimant
Vs
M/s. Sri Srinivasa Spintex India Limited, D.no.8-104,K.N.Road, Peddatadepalli(V),Tadepalligudem (M), West Godavari Dist, AP Pin-534101. ...Respondent

NOTICE

The above named Claimant had filed Reference and statement of claim against the Respondent for recovery of dues by statutory Arbitration as per MSMED Act of 2006. Respondent failed to comply with previous notices. Hence,this final notice requires respondent to make his personal appearance before Facilitation Council located at GMDIC, S-31,Second Floor, Integrated District Offices Complex(IDOC), Collectorate, Ranga Reddy District, located in kongarkalan (V),Ibrahimpatnam (M), Ranga Reddy District -Pincode-501510 on 16.03.2024 at 3.30 PM.In case of non-comliance, the said claim will be decided on merits by Council.
// BY ORDER OF THE CHAIRMAN MSEFC: RANGA REDDY\\